క్లుప్తంగా

హరిదాసుకు సత్కారం



జె.కొత్తూరులో హరిదాసు కృష్ణను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో శనివారం హరిదాసును ఘనంగా సన్మానించారు. సంక్రాంతి సందర్భంగా భద్రాచలం వద్ద కూనవరం నుంచి వచ్చి నెల రోజుల పాటు జె.కొత్తూరులో నగర సంకీర్తన నిర్వహించిన హరిదాసు కృష్ణను గ్రామ పెద్దలు, చిన్నయ్యపేట యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సత్కరించి రూ.20 వేలు, కొత్త దుస్తులు అందజేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, చిన్నయ్యపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు టవల్స్ పంపిణీ



తునిలో రిక్షా కార్మికులకు టవల్స్ అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర ఆల్వార్ దాస్ వర్ధంతిని పురస్కరించుకొని తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తుని పట్టణం ఫీడర్ రోడ్డులో రిక్షా కార్మికులకు టవల్స్‌ను క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు పంపిణీ చేశారు. పేదలకు సేవలు అందిస్తున్న వాకర్స్ క్లబ్‌ను అభినందించారు. వాకర్స్ ఏరియా ఉపాధ్యక్షుడు అభిమన్యు నాయక్, గవర్నర్ చదరం శివాజీ, జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, తుని శాఖ అధ్యక్షుడు డీఎస్.మూర్తి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, శివ, పర్వత బాబూరావు, వేణు గోపాలస్వామి, సత్యసాయి, జోసఫ్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సెబ్ సీఐ అశోక్ బదిలీ



బదిలీ అయిన సీఐ అశోక్, సెబ్ ఎస్సై శ్రీనివాసరావులను సత్కరిస్తున్న సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ పి.అశోక్ బదిలీ అయ్యారు. ఏడాది క్రితం ప్రత్తిపాడు సెబ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన కృష్ణా జిల్లా తిరువూరు సెబ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా శనివారం సాయంత్రం స్థానిక సెబ్ స్టేషన్‌లో సీఐ అశోక్‌ను సిబ్బంది పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్టేషన్ పరిధిలో సీఐ అశోక్ అందించిన సేవలను కొనియాడారు. సీఐతో పాటు రాజమహేంద్రవరం సెబ్ స్టేషన్‌కు బదిలీ అయిన బి.శ్రీనివాసరావును కూడా సిబ్బంది సన్మానించారు.

మృతుడి కుటుంబానికి బీమా అందజేత



నీలాద్రిరావుపేటలో మృతుడి కుటుంబానికి బీమా తక్షణ సహాయం అందజేస్తున్న అధికారులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన వెంపల సత్తిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ జీవిత బీమా మంజూరైంది. తక్షణ సహాయం కింద శనివారం రూ.10 వేలను పంచాయతీ కార్యదర్శి తరంగిణి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కాకి శ్రీను తదితరులు మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివ గోవిందు, నక్కా అబ్బు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం

తొండంగి: మండలవ్యాప్తంగా కులగణన సర్వేను ప్రారంభమైందని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ శనివారం తెలిపారు. పలు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటా పర్యటించి సర్వే చేశారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. 520 మంది వలంటీర్లు కుల గణన సర్వే చేస్తున్నారన్నారు. ఈ నెల 28 వరకూ ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్వగృహమస్తు!

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- ఒకే చోట 4,715 మందికి స్థలాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తుని: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పూరి గుడెసెలు, అద్దె ఇళ్లలో ఉంటున్న అక్కచెల్లెమ్మలు సొంత ఇంటి వారయ్యారు. దశాబ్దాల కాలం నాటి సొంతింటి కల సాకారం కావడంతో పేదల సంతోషానికి అవధుల్లేవు.

గతంలో 1154 మందికి..

గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టణంలోని ఉప్పరగూడెంలో 1154 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. 2019లో జన హృదయ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. తుని పట్టణ పరిధిలోని 30 వార్డులకు చెందిన పేదల నుంచి వలంటీర్ల ద్వారా దరఖాస్తులు తీసుకుని సచివాలయాల ద్వారా అర్హులను ఎంపిక చేశారు. లబ్ధిదారులకు తుని మండలం రాజుపేట సమీపంలో స్థల సేకరణ చేసి 4715 మందికి స్థలాలు ఇచ్చారు. ఇందులో 4515 మందికి ప్రభుత్వం గృహాలను మంజూరు చేసింది. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంట్, ఇసుకను అందించారు.

తుని పట్టణంలో వివరాలు

ఇళ్ల స్థలాలు మంజూరు	4715
గృహాల మంజూరు	4515
పనులు చేపట్టినవి	1680
పూర్తి చేసినవి	60
శ్లాబు దశలో ఉన్నవి	120
వివిధ దశల్లో ఉన్నవి	2835

పనులు ఆలస్యంగా మొదలైనా నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. 1680 లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టగా 60 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. శ్లాబు దశలో 120, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పురపాలక, గృహ నిర్మాణశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

మౌలిక వసతులు కల్పన



తుని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పట్టణంలో టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పన విషయంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్, బోర్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. జోరుగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో ఎప్పటికప్పుడు బిల్లు మొత్తాన్ని గృహ నిర్మాణ శాఖ జమ చేస్తోంది.

మాకు జగనన్న వరం ఇచ్చారు



చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. పిల్లల చదువులు, అద్దె ఇంట్లో కాపురం ఇలా నెలకు వచ్చే సంపాదన కుటుంబ ఖర్చులకే సరిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సొంతిల్లు కట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇస్తామని మా వాలంటీర్ చెప్పాడు. నేను దరఖాస్తు చేశాను. సచివాలయం నుంచి మీకు ఇళ్ల స్థలం మంజూరు చేశారని చెప్పారు. నాలో చెప్పలేని ఆనందం. అనుకున్నట్టే ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఇనుము, సిమెంట్, ఇసుక తక్కువ ధరకు ఇచ్చారు. మా ఇంటి నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి.

–ఎంఎస్ వెంకట రమణమ్మ, రైల్‌నగర్, తుని

పేదల జీవితాల్లో వెలుగులు



మాది పేద కుటుంబం. పనికి వెళితేనే పూట గడుస్తుంది. పిల్లల చదువులకు అమ్మఒడి ఇస్తున్నారు. సగం భారం తగ్గింది. అభివృద్ధి చెందిన తుని పట్టణంలో ఇళ్లు కట్టుకోవాలంటే సామాన్యులకు సాధ్యం కాదు. ఇళ్ల స్థలానికే రూ.లక్షల్లో వెచ్చించాలి. మలాంటి పేదలను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇనుము, ఇసుకను అందించారు. మేం కడుతున్న ఇంటికి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకరిస్తున్నారు. పేదలకు ఇంత కంటే మేలు ఎవరు చేస్తారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. –కర్రి లక్ష్మి, బాలాజీ రోడ్డు, తుని

పార్టీ విజయానికి కృషి చేయాలి



లింగంపర్తిలో సుబ్బారావును గజమాలతో సత్కరిస్తున్న ఎంపీపీ రాజబాబు, పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబుతో పాటు మండలానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వరుపులను శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. తామంతా వరుపుల వెంటే ఉన్నామని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత వరుపుల సూరిబాబు, పార్టీ శంఖవరం మండల కన్వీనర్, సర్పంచ్ నరాల శ్రీను, సర్పంచులు సకురు గుర్రాజు, ఈగల విజయదుర్గ, బొట్టా చైతన్య, ఎంపీటీసీ సభ్యుడు దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో తోట నరసింహం పర్యటన



గోకవరం సంజీవయ్యనగర్‌లో పార్టీ నాయకులతో తోట నరసింహం

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం పర్యటించారు. గోకవరంలో ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ భర్త తోలేటి రాంప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా సంజీవయ్య నగర్ కాలనీవాసులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చెయాలని కోరారు. అనంతరం తంటికొండలో సతీవియోగంతో బాధపడుతున్న దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి బాబిని పరామర్శించారు. అనంతరం గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, బద్దిరెడ్డి తులసి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ యువనేత తోట రాంజీ, నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, సీహెచ్‌సీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సమ్మెటి నాని, దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బద్దిరెడ్డి అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు న్యాయం చేయాలని వినతి



హోంగార్డుల సమస్యలపై మిథున్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న రిపబ్లికన్ పార్టీ నేతలు

జగ్గంపేట: రాష్ట్రంలో సుమారు 15 వేల మంది హోంగార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని రిపబ్లికన్ పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రిపబ్లికన్ పార్టీ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జుత్తుగ నాగేశ్వరరావు శనివారం జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లిన సందర్భంగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో మిథున్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. రాష్ట్రంలో చాలీచాలని జీతాలతో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనిపై మిథున్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో దళిత నేతలు వల్లూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం



కోటనందూరులో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలస్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడాపోటీల్లో విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం క్రికెట్, షటిల్, వాలీబాల్ కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఎంతోమంది గ్రామీణ క్రీడాకారులు ఇళ్లకే పరిమితమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, మండల చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ సుర్ల రాంబాబు, గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

ఆడుదాం..ఆంధ్రా విజయవంతం

ప్రత్తిపాడు: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయిలో విజయవంతమైందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన అధికారులు, పీఈటీలను అభినందించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి బహుమతులు, మెమెంటోలను అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్ నైట్టి దేవీకుమారి, పీఈటీలను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంఈఓ వి రాజబాబు, ఈఓఆర్డీ కె కాశీవిశ్వనాథం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, పినిశెట్టి ప్రకాష్, గజ్జనపూడి సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల వద్దకే వైద్యం



ధార మల్లాపురంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సామ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని ధారామల్లాపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సౌమ్యశ్రీ రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు పరీక్షలు చేశారు. 50 మంది సాధారణ రోగులు, 15 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 20 మంది మధుమేహ బాధితులు, 25 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందించామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

అధ్వానంగా పారిశుధ్యం



దిబ్బలపాలెంలో రహదారిపై పేరుకుపోయిన చెత్త



శివాలయం వీధిలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

- పూడుకుపోయిన డ్రైన్లు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అధికారుల నిర్లక్ష్యం తూట్లు పొడుస్తోంది. ఏలేశ్వరంలో పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లల్లో పూడిక పేరుకుపోయి మురుగు నీరు ఇళ్ల నిలిచిపోతోంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. రహదారులపై చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ అభివృద్ధిలో మార్పు లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఓ పక్క ప్రభుత్వం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే మరో పక్క ఇక్కడ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రోడ్లపై మురుగునీరు

స్థానిక శివాలయం వీధిలోని డ్రైన్‌లో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ వీధి, తోటవీధితో పాటు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. స్థానిక దిబ్బలపాలెం గ్రంథాలయం ఎదురుగా ప్రధాన రహదారి, కప్పలచెరువు సమీపంలోని రహదారిపై, పెద్దవీధి పార్కు సమీపంలో రహదారి చెంతనే చెత్త పేరుకుపోయింది. షిర్డీనగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. వీటిపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరచడానికి చర్యలు తీసుకున్నాం. పారిశుధ్య సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారు. మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలి. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలి.

– కె.శ్రీనివాసరావు, నగర పంచాయతీ కమిషనర్, ఏలేశ్వరం

ధూళిపాళ్ల నరేంద్ర వ్యాఖ్యలు సరికావు

గోకవరం: పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు ధూళిపాళ్ల నరేంద్ర చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూలగొడతామని ధూళిపాళ్ల అన్నట్టుగా వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోందని, అదే నిజమైతే ఆ వ్యాఖ్యలు సరైనవికావన్నారు. దళితుల మనోభావాలను గౌరవించి, తమ ఆత్మాభిమానం పెంపొందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ స్మృతివనాన్ని నిర్మించి ప్రారంభించారన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం దురదృష్టకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి దళితులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ పూజలు



జగ్గంపేట విష్ణాలయంలో ప్రత్యేక పూజలు, పారాయణ చేస్తున్న మహిళలు

జగ్గంపేట: అయోధ్య రామమందిరంలో స్వామివారి స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ దిగ్విజయంగా జరగాలని కోరుతూ జగ్గంపేటలోని విష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పి.శ్రీనివాస్ దాసాంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, సుందరకాండ పారాయణ, విశేష పూజలు చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా 22న రాజగోపాల స్వామి రామావతారంలో దర్శన మిస్తారని తెలిపారు. మహిళా సంఘం నేతలు ధారా లక్ష్మి, కొత్త చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



రంగవల్లి నగర్‌లో బాధితులకు గ్యాస్ స్టౌ, సిలిండర్లు పంపిణీ చేస్తున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలకు శనివారం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, పోలీసుల సహకారంతో కొనుగోలు చేసిన సుమారు రూ.28 వేల విలువ చేసే గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్లను బాధితులకు అందజేశారు. రంగవల్లి నగర్‌లో బాధితులను శనివారం సీఐ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకులు వీరాంజనేయులు అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని సీఐ లక్ష్మణరావుకు వివరించారు.కార్యక్రమంలో జగ్గంపేట ఏఎస్ఐ సుబ్బారావు, రైటర్ కృపావరం, రంగవల్లి నగర్ వాసులు పాల్గొన్నారు.

టోల్ గేట్ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

కిర్లంపూడి: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లారీ డ్రైవర్లు కృష్ణవరం టోల్‌గేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. కాకినాడ జిల్లా హోరథ సారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు వాసు మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధితులను చేస్తూ రూ.7 లక్షల జరిమానా, జైలు శిక్ష విధించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు, రోడ్డు సేఫ్టీ, హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తాటాకిల్లు దగ్ధం

రూ. 4 లక్షల ఆస్తినష్టం



అల్లిపూడిలో కాలిబూడిదైన తాటాకిల్లు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి ఎస్సీ కాలనీ–2లో శుక్రవారం అర్ధరాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... అల్లిపూడి ఎస్సీ కాలనీకి చెందిన చిట్టిమూరి పెద్దిరాజు తన తాటాకింట్లో రోజూ మాదిగానే నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి భారీగా మంటలు చెలరేగాయి. ఉక్కిరిబిక్కిరైన పెద్దిరాజు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశాడు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గొళ్లెం పెట్టి ఇంటికి నిప్పు అంటించారని బాధితుడు ఆరోపించాడు. ఈ ప్రమాదంలో రూ. 1.5 లక్షల నగదుతో పాటు టీవీ, రిఫ్రిజిరేటర్, బీరువా తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు. వీఆర్వో వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు బాధితుడిని పరామర్శించారు.